


19న పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి -పాడేరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19న పాడేరు పాలిటెక్నిక్ ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి ప్రశాంత్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో మెడిప్లస్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, డెలివరీ, అమర్‌రాజా, భారత్ పే వంటి ప్రముఖ కంపెఈనల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగార్థులను ఎంపిక చేస్తారన్నారు. జిల్లాలో 18-35 ఏళ్ల ఇంటర్మీడియట్, డిప్లొమా , డిగ్రీ ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్‌కార్డు , ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం 10వేలు నుంచి రూ.20వేలు వరకు చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 6302636174, 9398338105 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని ప్రశాంత్‌కుమార్ సూచించారు.

అక్రమ నిర్మాణాలపై ఉదాసీనత తగదు

- 23న ఆదివాసీ గిరిజన సంఘం రౌండ్ టేబుల్ సమావేశం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



రౌండ్ టేబుల్ సమావేశం వివరాలు వెల్లడిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి -హుకుంపేట: ఏజెన్సీలో గిరిజనేతరులు యథేచ్ఛగా సాగిస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారుల ఉదాసీనత తగదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ధ్వజమెత్తారు. అధికారులు వచ్చి పరిశీలించిన తర్వాత అక్రమ నిర్మాణాల జోరు మరింతగా పెరగడం మరింత దారుణమని మండిపడ్డారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘ మండల అధ్యక్షులు పాంగి సోమన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సురేంద్రతోపాటు అల్లూరి జిల్లా తరపున పరిశీలకునిగా పొద్దు బాలదేవ్ హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా మండలకేంద్రంలో గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేసిన స్పందించక పోవడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలపై దర్యాప్తునకు ఐటిడిఎ పిఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మండలానికి వచ్చి వెళ్లిన తర్వాత వీటిజోరు మరింత పెరగడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అసలు అక్రమ నిర్మాణాలు అడ్డుకట్ట వేయడానికి అధికారులు వచ్చారా? లేక వాటిని వేగవంతం చేయాలని ఆదేశించారో? అంతుపట్టడం లేదన్నారు.

జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ 1/70 చట్టం పటిష్టంగా అమలుకు ఆదివాసీ గిరిజన సంఘం చేపడుతున్న ఉద్యమాలలో ప్రజలకు భాగస్వామ్యం కావాలన్నారు. .ఈ నెల 23న ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించే రౌడ్ టేబుల్ సమావేశానికి అన్ని వర్గాల ఆదివాసీ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ,కార్మిక, కర్షక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసుల హక్కులు, చట్టాలు పరిరక్షణకు, పటిష్టంగా అమలుకు సలహాలు సూచనలు చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, మాజీ కార్యదర్శి ఆనంద్, లింగమూర్తి, వంశీ, బాలన్న, బిబి ప్రసాద్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టూరిజం కార్మికులకు అర్ధ వేతనం అన్యాయం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్


టూరిజం కార్మికులతో చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి -జి.మాడుగుల : కొత్తపల్లి జలపాతం వద్ద ఐటిడిఎ ఆధ్వర్యంలో పనిచేస్తున్న టూరిజం కార్మికులకు సీజన్ మూడు నెలల్లో తప్ప మిగిలిన తొమ్మిది నెలలూ అర్థ జీతాలు ఇవ్వడం దుర్మార్గమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్యపడాల్ ధ్వజమెత్తారు, మంగళవారం మండలంలోని కొత్తపల్లి జలపాతంలో పనిచేస్తున్న టూరిజం కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ, కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సౌకర్యార్థం మేనేజర్, సూపర్వైజర్లతో కలిపి 23 మంది పని చేస్తున్నారని, మేనేజర్‌కు నెలకు రూ.20వేలు, సూపర్‌వైజర్లకు నెలకు రూ.12వేలు వేతనం చెల్లిస్తున్నారన్నారు. అయితే కార్మికులకు పర్యాటక సీజన్ నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో రూ.8వేలు చొప్పున చెల్లిస్తున్నప్పటికీ, మిగిలిన నెలల్లో అర్థజీతం రూ.4వేలు మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు. కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకపరంగా ఏటా రూ.40లక్షలు పైచిలుకు ఆదాయం వస్తుందని, దానికి తగ్గట్టుగా కార్మికులకు జీతభత్యాలు ఇవ్వకపోవడ దుర్మార్గమని మండిపడ్డారు. అంతేకాక జలపాతం వద్ద రెండే మరుగుదొడ్లు ఉన్నాయని, పర్యాటకులు ఎక్కువగా వచ్చే రోజుల్లో అవి ఎటూ సరిపోవడం లేదన్నారు. గేట్లు కూడా సరిగా లేవని ఎన్నోసార్లు ఐటిడిఎ పిఒకు మొత్తుకున్నా స్పందన లేదన్నారు. సీజన్‌లో మాదిరిగానే ఏడాది పొడుగునా కార్మికులకు పూర్తి వేతనం చెల్లించాలని, జలపాతం వద్ద సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, గడుతూరి సత్యనారాయణ, టూరిజం వర్కర్స్ సూపర్వైజర్లు, వంతల రాజు, వంతల అభి, వి రాము, కే నాగేశ్వరరావు,, ఎస్ ప్రశాంత్, మీ శ్రీను, కే కష్ణ బాబు, వి సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి లక్ష్యం

- వివిధ శాఖల అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దిశా నిర్దేశం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు : గంజాయి సాగు రహితంగా అల్లూరి జిల్లాను తీర్చిదిద్దడమే అందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గంజాయి సాగు నిర్మూలనపై అధికారులకు దిశా నిర్దేశం చేసారు. గంజాయిని సాగు, అక్రమ రవాణా చట్టరీత్యానేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయం, అటవీ శాఖ, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, విద్య, ఐసిడిఎస్, డ్వామా, డిఆర్‌డిఎ ఇతర శాఖల అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సాగుపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయం, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల కార్యాలయాల వద్ద ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీలు,ఉన్నత పాఠశాలలో గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలల్లో అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు వచ్చిన బాధితుల వివరాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులుపై ప్రత్యేక దృష్టి పెట్టి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకల యూనిట్లను మంజూరు చేయాలని సూచించారు. జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ సమావేశం రోజున గంజాయి వినియోగం వలన వచ్చే ఆరోగ్య సమస్యలపై చర్చించాలని సూచించారు.


గంజాయి సాగుతోభావితరాలకు ముప్పు :డిఐజి

ఈ సందర్భంగా డిఐజి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్‌కు జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశిచారు. గంజాయి నిర్మూలనలో భాగమైన ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేసారు. గంజాయి సాగులో భాగస్వామ్యమైన వారి వివరాలు సేకరిస్తున్నామని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, గంజాయి సాగు, అనర్థాలపై ప్రజలను చైతన్యవంత చేయాలనిన్నారు. జిల్లా ఎస్పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు. యువతకు స్వయం ఉపాధి పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన యువతకు స్వయంఉపాధికి రుణ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. జి.మాడుగుల, చింతపల్లి, ముంచంగిపుట్టు, జి.కె. వీధి, కొయ్యూరు మండలాలపై దృష్టి పెట్టాలని చెప్పారు.

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు, గిరిజన రైతులకు ఉద్యానవన పంటలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై కార్యచరణ అమలుకు మండల, గ్రామ, ఐటిడిఎ స్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. పివిటిజిలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎఎస్పి ధీరజ్, డిఆర్ఒ బి.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

జిప్‌లైన్‌ను సొసైటీ ద్వారా నిర్వహించాలి

- గ్రామసభలో స్పష్టం చేసిన ప్రజాప్రతినిధులు, ప్రజలు


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

ప్రజాశక్తి -అనంతగిరి : గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి ఎటువంటి అనుమతులు లేకుండా బొర్రా గుహలు వద్ద గిరిజనేతరుడు అక్రమంగా నిర్మించిన జిప్‌లైన్‌ను స్థానిక గిరిజన సొసైటీ ద్వారా కొనసాగించాలని, లేకుంటే పూర్తిగా రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. జిప్‌లైన్ ఏర్పాటు, నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై అందిన పలు ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం బొర్రా గేటు వలస గ్రామ సచివాలయం వద్ద స్థానిక సర్పంచ్ జె అప్పారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ హాజరై గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పలువురి అభిప్రాయాలను సేకరించారు.

విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక స్టేట్ కౌన్సిలర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ 1/70, పీసా చట్టాలకు విరుద్ధంగా ఏజెన్సీలో గిరిజనేతరులు ఇటువంటి వ్యాపారాలు నిర్వహించడం చట్టవ్యతిరేకమన్నారు.అటువంటిది గిరినేతర వ్యక్తికి ఈ జిప్‌లైన్ నిర్వహణ బాధ్యతలను ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. ఏర్పాటైన తొమ్మిది నెలల కాలంలో దాదాపు రెండున్నర కోట్ల రుపాయల ఆదాయం సమకూరితే, పర్యాటకశాఖకు కేవలం రూ.65వేలు చెల్లించారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, దీని నిర్వహణను స్థానిక గిరిజన సొసైటీలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్ జన్ని. అప్పారావు మాట్లాడుతూ పర్యాటక శాఖ అనుమతులతో జిప్‌లైన్ ఏర్పాటు చేశాక ట్రయల్‌రన్‌కు సరేనన్నామని, అనంతరం దీని నిర్వహణకు గ్రామసభ అనుమతి తీసుకోవాలని అప్పట్లో సూచించినా నిర్వాహకుడు రాలేదన్నారు. దీంతో జిప్‌లైన్‌ను మూసేయక తప్పలేదన్నారు. పీసా కమిటీ సభ్యులు ఎస్.రాంబాబు, డి డానియేల్ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా జిప్‌లైన్ నిర్వహించి లాభాలు అర్జించే నిర్వాహకులు తిరిగి చెల్లించాలన్నారు. దీని నిర్వహణకు స్థానికసొసైటీకి అప్పగించి, ఇందులో పనిచేస్తున్న కార్మికులకు చట్టబద్ధత కల్పించాలన్నారు.

ఎస్‌డిసి శర్మ మాట్లాడుతూ, గ్రామసభలో అందరి అభిప్రాయాలను సేకరించి, నమోదు చేశామని, దీనిపై జిల్లాకలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నగేష్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మాణిక్యం, ఆర్ఐ శంకరరావు, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అనంతగిరి ఎంపిపి శెట్టి, నీలవేణి, మాజీ సర్పంచ్ ప్రసన్నకుమార్, గ్రామస్తులు సింహాద్రి, ధారు, నీలన్న, నిర్వాహకుడు జస్టిన్ తదితరులు పాల్గొన్నారు

ఏజెన్సీ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం


వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఐటీడీఎ పీఓ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీ అభివృద్ధికి వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏలింకో స్వచ్ఛంద సంస్థ ద్వారా వికలాంగులకు పరికరణలు పంపిణీ కార్యక్రమం స్థానిక పీఎంఆర్సి ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా వికలాంగులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వివిధ రకాలైన వికలాంగుల పరికరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ పరిధిలో వై రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన 142 మంది వికలాంగులకు కేంద్ర ప్రభుత్వ వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా వీటిని అందించినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవోలను ఆదేశించినట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ వికలాంగుల పరికరాలను సద్వినియోగపరుచుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగ బొజ్జయ్య, జడ్పిటిసి పండా వెంకటలక్ష్మి. మారేడుమిల్లి ఎంపీపీ సార్ల లలిత, వైస్ ఎంపీపీలు పండ కుమారి, కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, మాజీ సర్పంచ్ వై. నిరంజనీదేవి, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, సిఆర్ఓ మధుసూదనరావు, అప్పలనాయుడు, ప్రకాష్, అల్లూరి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన వంతెన మరమ్మతు పనులు

ప్రజాశక్తి -సీలేరు

జీకేవీధి మండలం లంకపాకల -సప్పర్ల మధ్యలో వంతెన అప్రోచ్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిపి అభిషేక్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి అధికారులు రహదారి క్లియరెన్స్ పనులు యుద్ధప్రాదిపదికన పూర్తి చేసినా ఆర్టీసీ బస్సు సర్వీసులు మాత్రం తిరగడం లేదు. ఇటీవల భారీ వర్షాలకు వంతెన అప్రోచ్ పూర్తిగా కోత గురి కావడంతో వంతెన గాలిలో వేలాడుతుంది. చిన్న చిన్న వాహనాలు రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా వంతెన కింద కర్రలు సపోర్టు పెట్టారు. రెండు రోజుల్లో బస్సులు రాకపోకలు కొనసాగే విధంగా వంతెన అప్రోచ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పటికీ ఈ వంతెన అప్రోచ్ పనులు పూర్తికాకపోవడంతో విశాఖపట్నం సీలేరు, భద్రాచలం బస్సులు తిరగడానికి వీల్లేకుండా ఉంది. దీంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు అడ్డూ అదుపు లేకుండా ప్రయాణికుల వద్ద అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. సీలేరు నుంచి నర్సీపట్నం ఒక మనిషి ప్రైవేట్ వాహనంలో రావాలంటే వెయ్యి రూపాయలు చెల్లించాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. మరో వైపు సీలేరు నుంచి లంకపాకల వరకు రహదారి క్లియరెన్స్ పనులు చేపట్టినప్పటికీ రోడ్లపై ఎక్కడికక్కడే మట్టి ఉండిపోవడంతో వర్షం కురిస్తే చాలు ద్విచక్ర వాహనాలు ఆటోలు ప్రమాదానికి గురికాక తప్పడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ పీవో స్పందించి లంకపాకలను సీలేరు వరకు బీటీ రోడ్డు మీద ఉన్న మట్టిని పూర్తిస్థాయిలో తొలగించాలని, వంతెన అప్రోచ్ మరమ్మలు పూర్తి చేయాలని కోరుతున్నారు.


సంపంగిగొంది- సప్పర్ల మధ్యలో ప్రధాన రహదారిపై వంతెనకు కర్రలు దన్నుగా పెట్టిన దృశ్యం

గిరిజన రైతులతో ఇ- క్రాప్, ఇకెవైసి చేయించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని అన్ని మండలాల్లో గిరిజన రైతుల చేత వారి పంటలకు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన రైతుల భూములలో మట్టి నమూనాలతో ఏ పంటలు సాగు చేయుచున్నది ల్యాండ్ ప్రొఫైలుతో మండలాల వారిగా నివేదికల సమర్పించాలని కోరారు. అగ్రికల్చరల్, ఆర్టికల్చరల్ ఇంజుమురేషన్ చేయాలన్నారు. చేపల పెంపకం రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ ఎఫ్డిఓ బాలాజీని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. మారుమూల ప్రాంతాలలో నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాజెక్ట్ అధికారికి విజ్ఞప్తి చేయగా, ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి సెల్ టవర్లు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పిఒ తెలిపారు. కోతుల నివారణకు రైతులకు సోలార్ ఫెంచింగ్ ఏర్పాటు చేసిన యెడల రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందుతారని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యనారాయణ, అన్ని మండలాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు, చీరల పంపిణీ


బాధితులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఇటీవల నాలుగు పర్యాయాలు వరదలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీసీ కాలనీలోని 150 కుటుంబాలకు త్రియేక దేవాలయం (ఎఫ్‌జెసిసి) దైవజనుడు యేసు రత్నం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా మంగళవారం వంట సామాగ్రి, ముసలి వాళ్లకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ విపత్తు కలిగించిన నష్టం పూడ్చలేనిన్నారు. చర్చ పాస్టర్ యేసు రత్నం మాట్లాడుతూ తమ కళ్ళముందే వరదలతో అనేక ఇబ్బందులకు పడుతున్న వారిని చూసామని, వారికి ఎంతో కొంత సహాయంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భవాని, రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, పెద్ద మట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, విఆర్ పురం సర్పంచ్ సోడి నరసమ్మ, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కారం సుందరయ్య, సోడి మల్లయ్య, వీర్ల నాగేశ్వరరావు, జి లక్ష్మణరావు, వైసిపి నాయకులు బొడ్డు సత్యనారాయణ, బీసీ కాలనీ వరద బాధితులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

కొత్తగా పెళ్లయిన వారు, రేషన్ కార్డ్ కావలసినవారు కొన్ని నెలలుగా రేషన్ కార్డు లేకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని, ఎమ్మార్వో, ఎంపిడిఒలు స్పందించి కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయాలని వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ సిద్దు సుధీర్, రాజ్ రాపాక (బాబి) మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రేషన్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి లబ్ధి కూడా కోల్పోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది పేదలు దిగువ మధ్య తరగతి వారు చాలా బాధలు పడుతున్నారని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందించినట్లు సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోదావరి వరదల వల్ల మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 40 అడుగులు గోదావరి వస్తే తమ గ్రామాల్లో కరెంటు ఉండటం లేదన్నారు. చిన్నఆర్కూర్ గ్రామం నుండి రేగుల పాడు గ్రామం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు మీదుగా స్తంబాలు వేసి కరెంటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ నాగమణి, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు

పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలు



పాడేరులో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు: పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఆర్టీసి కాంప్లెక్స్ వరకు నిర్వహించిన స్వచ్ఛతాహీ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్వచ్ఛ తాహీ కార్యక్రమం వచ్చేనెల 2 గాంధీ జయంతి వరకు కొనసాగుతుందని, ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఎ పిఒ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిపిఒ కొండలరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, డిఇఒ బ్రహ్మాజీ, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, ఎంపిడిఒ సాయి నవీన్, ఎటిడబ్ల్యూఒ ఎల్. రజని, ఎంఇఒ సరస్వతి, ఎల్‌డి. ఎ. మాతు నాయుడు, పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు.మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అరకులోయ మంల పరిషత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరికీ ప్రతిజ్ఞ చేయిస్తూ,గాంధీజీ ఆశయాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపిపి రంజపల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి శెట్టి రోషిణి, వైస్ ఎంపీపీలు కొర్ర సుమంజలి, కిల్లో రామన్న, ఎంపిడిఒ వెంకటేష్ ,పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఎంపిటిసిలు భీమరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : మండలంలోని కొర్రాయి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ బి కొములు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపిడిఒ బి ఉషారాణి ఆధ్వర్యంలోమండల పరిషత్తు కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీని చేపట్టారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎంపిపి ఈశ్వరి, జెడ్‌పిటిసి సిహెచ్ జానకమ్మ సర్పంచ్ వెంకటరావు, ఇఒపిఆర్‌డి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయిని సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకు స్వచ్ఛతాహి సేవా ర్యాలీ నిర్వహించారు.ఇఒపిఆర్‌డి అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని పలు పంచాయతీ కేంద్రాలలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీలు నిర్వహించారు, బొర్రా పంచాయతీ కేంద్రం వద్ద జరిగిన ర్యాలీలో ఎంపిపి శెట్టి, నీలవేణి , జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నగేష్, ఉప తహశీల్దార్, మాణిక్యం పెద్దబిడ్డ సెక్రటరీ జి.అప్పలస్వామి పాల్గొన్నారు

రంపచోడవరం : ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టినట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాల అవుతున్న సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుండి దేవీపట్నం సెంటర్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ స్వచ్ఛభారత్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం దేవీపట్నం సెంటర్లో వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛతా హిసేవ కార్యక్రమం ఈనెల 17 నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె. బాలకృష్ణ, పండ కుమారి, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, సర్పంచ్ బొజ్జయ్య, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, డిఎల్‌పిఓ చిన్నబ్బులు, ఈవోపిఆర్‌డి జాన్ విల్టన్, ఎపీడీ వెలుగు ఎ.శ్రీనివాసరావు, డిపియంలు అపర్ణ, పరమేశ్వరరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు ,: ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయం నుండి చింతూరు మెయిన్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని పిఒ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమల, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయితీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం సర్పంచ్ పూనం సరోజిని, గ్రామ సెక్రెటరీ శివప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రజలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -హుకుంపేట : కలుషిత ఆహార బాధిత నలుగురు విద్యార్థుల కుటుంబాలకు మంగళవారం స్థానిక తహశీల్దార్ రాజ్యలక్ష్మి చెరో రూ.ఐదు వేలు చొప్పన ప్రభుత్వ ఆర్థికపరిహారాన్ని అందజేశారు. కలుషిత ఆహార బాధితులకు పరిహారం ఏది?' శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి, హుటాహుటిన పరిహారం చెల్లింపునకు చర్యలుచేపట్టారు.అయితే ఇంకా కిల్లో సంజయ్‌తేజ అనే విద్యార్థి కుటుంబానికి పరిహారం అందలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి- పాడేరు:: పాడేరు జిల్లా కలెక్టరేట్లో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ పూజ ప్రాముఖ్యతను వివరించారు. విశ్వ కర్మ జయంతి, విశ్వకర్మ పూజను తయారీ దారులు, ఇంజనీర్లు, జరుపుకుంటారన్నారు. కార్మికులు, పరిశ్రమలలో పనిముట్లకు విశ్వకర్మ జయంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఎ పిఒ వి.. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఒ ఎం. పద్మావతి, చింతపల్లి నుండి వచ్చిన విశ్వ బ్రాహ్మణులు లక్కోజు నాగభూషణం, చుక్కా సత్యనారాయణ, వేమవరపు సత్తిబాబు, తగరంపూడి తాతారావు, వేమవరపు సూరిబాబు, కంబడి లతా కుమారి, బేతాళ కెజియా రాజి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని, జర్రాకొండ పంచాయతీ కేంద్రంలో 130 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వాక్సినేషన్ చేశారు బాకూరు పశు వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని, వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించడం మంచిదన్నారు. 13 పశువులకు వ్యాధి నిర్ధారణకు రక్తపరీక్షలు చేశారు. పశువుల వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సన్యాసిరాజు, బుజ్జిబాబు, దొన్ను, సునీల్, సోమ, శేఖర్, బాలన్న, పద్మకుమారి, సౌధమిని, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంట్రాక్టు డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో పాడేరు ఆర్‌టిసి డిపో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లకు రవాణా శాఖ జిల్లా అధికారి(డిటిఒ) లీలాప్రసాద్ అవగాహన కల్పించారు. ప్రమాదాలకు తావు లేకుండా ఆర్‌టిసి బస్సులు నడపాలని డ్రైవర్లకు సూచించారు. ప్రయాణికులు సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు కీలకపాత్ర డ్రైవర్‌దేనని గుర్తు చేశారు. రోడ్డు భద్రతా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతను దృష్టిలో పెట్టుకుని, ట్రాఫిక్‌నిబంధనలు పాటిస్తూ ఆర్‌టిసి డ్రైవర్లు బస్సులు నడపాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం ఆవాస్ యోజన గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి -జి మాడుగుల : మండలంలోని పాలమామిడి పంచాయతీ లక్కులు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మాణం చేపట్టిన ఇళ్లల్లో మంగళవారం గృహప్రవేశాలు నిర్వహించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో దీనికి ప్రధాని నరేంద్రమోడీ శ్రీకారం చుట్టగా, లక్కులు గ్రామంలో హౌసింగ్ ఎఇఇ డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ పి భాస్కరరావు, ఎంపిటిసి జి అప్పారావు హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్, డేటా ఆపరేటర్, లబ్ధిదారులు పాల్గొన్నారు

అంకితభావంతో విధులు నిర్వహించాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకులోయ: మండలంలోని వివిధ శాఖల అధికారులు గిరిజనాభివృద్ధికి అంకితభావంతో విధులు నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ,ప్రజా సమస్యలపై చర్చించే మండలసభకు కొంతమంది అధికారులు రాకపోవడం, కిందిస్థాయి అధికారులను పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకు లోయలో ఫుట్‌పాత్ ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతంపై అధికారులు చూస్తూ మౌనవమించడం తగదన్నారు. అరకులో టౌన్ షిప్లో గిరిజనులకు ఎన్ని షాపులు ఉన్నాయి అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. గిరిజ నేతరులకు కట్టబెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పద్మాపురం పంచాయతీలో ప్రభుత్వ భూములు అన్యక్రాంతం, అక్రమ నిర్మాణాల్లో అధికారుల చేతివాటంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ సెక్రెటరీల ముడుపుల వ్యవహారం అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మండల పరిషత్ దుకాణ సముదాయానికి వెంటనే రిటెండర్ పిలిచి కొత్త నిరుద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు. గిరిజనేతరులు వుంటే వాటిని రద్దుచేసి, నిరుద్యోగ గిరిజనులకు ఇవ్వాలని ఎంపిడిఒ వెంకటేశ్వర్లును ఆదేశించారు.. పర్యాటక శాఖ, రిసార్ట్స్ అతిథిగృహాలు, హోటళ్ల నుంచి పెదలబుడు పంచాయతీకి రూ. ఒక కోటి 86 లక్షల పన్ను బకాయి వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పర్యాటకశాఖ గేట్లు మూసివేత ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. అరకులోయలోని ప్రయివేటు లాడ్జిలు, హోటల్ యజమానుల మోసాలపై దృష్టిపెట్టి అన్నింటా ఫిక్స్‌డ్ రేట్లు అమలు చేయాలని సూచించారు. పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ, అరకులోయ అభివృద్ధికి ఎంపి, ఎమ్మెల్యే, ఎంపిపి, జెడ్‌పి చైర్మన్లు తమ కోటా నుంచి నిధులు కేటాయించాలని కోరారు.

పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎండపల్లి వలసలో ఇల్లులు లేని చోట్ల, గిరిజనేతరులు నివాసముండే ప్రాంతాల్లో సిసి రోడ్లు ఎలా నిర్మించారనిఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాటు ఎంపిటిసిలు దుర్య ఆనంద్ కుమార్, పెదలబుడు ఎంపీటీసీ ఎల్బీ బీమరాజు తదితరులు ప్రశ్నించారు. ఎండపల్లి వలసలో సిసి రోడ్లకు బిల్లులు చేస్తే ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. సుంకరమెట్ట పంచాయతీలోని దండపాడు, కినంగూడలో ట్రాన్స్ ఫార్మర్ల సమస్య వెంటనే పరిష్కారం చేయాలని సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చినబాబు అన్నారు. దాబుగూడలో కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అరకులోయ వీధుల్లో చెత్తాచెదరాలు వెంటనే తొలగించాలని, రాత్రి వేళలో ముఖ్యకూడళ్లలో పోలీస్ నిఘా పెంచాలని జెడ్‌పిటిసి శెట్టి రోషిణి కోరారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ఉత్సవవిగ్రహంలా ఎంపిపి

మండల సర్వసభ సమావేశానికి అధ్యక్షత వహించాలని ఎంపిపి ఉషారాణి మౌనం దాల్చిఉత్సవ విగ్రహంలా కనిపించడం పలు విమర్శలకు తావిస్తోంది. సమావేశంలో ఎంపీపీ ఉషారాణి కనీసం నోరెత్తకపోవడంతో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు సమన్వయం చేసి మండల సభను నిర్వహించారు. ఇది ఎంపిపికి అవమానించినట్లేనని పలువురు అంటున్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామన్న, వివిధ శాఖల అధికారులు ఎంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

గురుకుల విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం బాలికల గురుకుల కళాశాలలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల బాలికల కళాశాల విద్యార్థులను పిఒ సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మంగళవారం పరామర్శించారు. కళాశాలలో ఏ సమస్యలు ఉన్నాయో విద్యార్థులను అడగ్గా.., నీటి సమస్య, బాత్రూముల సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరారు. ఈ సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు మరి కొంతమందితో దర్యాప్తునకు కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా సరే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎం వెంకట ఇందిరా, వైద్యాధికారులు క్రాంతి కిరణ్, ప్రేమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులతో గుంజీలు తీయించి వారు అస్వస్థతకు గురవ్వడానికి కారణమైన ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రంపచోడవరం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గణేష్, వినోద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గురుకుల కళాశాలలో జరిగిన ఘటన అత్యంత దారుణమన్నారు. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను హింసించడం ఘోరమన్నారు. గుంజీలు తీయించి, వెంటనే పరిగెత్తించడం వంటి చర్యలు వలన విద్యార్థినులను అస్వస్థతకి గురయ్యారని పేర్కొన్నారు. వెంటనే బాధ్యులైన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని, అస్వస్థత గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కందిరీగల దాడిలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ :మండలంలోని కితలంగి పంచాయతీ పింపాల్‌గుడలో కందిరీగల దాడిలో గిరిజన యువకుడు గాయపడి ఆసుపత్రి పాలైన సంఘటన చోటుచేసుకుంది. పింపోల్‌గూడ గ్రామానికి చెందిన కొర్రా ప్రవీణ్ కుమార్ అనే యువకుడు సమీపంలోని కాపీ తోటకు పనికెళ్లారు. కాఫీ తోటలో పిచ్చి మొక్కల తొలగిస్తుండగా, కందిరీగలు దాడి చేసి గాయపరిచాయి. గమనించిన బాధితుని కుటుంబీకులు వెంటనే స్థానిక పిహెచ్‌సికి ప్రైవేటు వాహనంలో తరలించారు. బాధిత గిరిజన యువకుడు వైద్యం పొందుతున్నారు.

చట్రాపల్లి బాధితులకు అండగా నిలవండి

ప్రజాశక్తి.- చింతపల్లి: వర్షాలతో కొండచరియలు విరిగి పడి, అతలాకుతలమైన చట్రాపల్లి బాధితులకు భారీగా విరాళాలిచ్చి ఆదుకోవాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8న అర్ధరాత్రి వర్షవిలయంలో చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడి, గ్రామమంతా తుడిచిపెట్టుకుపోయిన ఘటనలో కొర్ర కుమారి మృతి చెందగా, మరో ముగ్గురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇళ్లు, ఆస్తులు సర్వం కోల్పోయ నిరాశ్రయులైన బాధితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలరాజుకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొట్టడం వీర వెంకట వరప్రసాద్, స్థానిక ఎంపిపి కోరాబు అనూష దేవి విరాళాలు ఇచ్చారు.కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దిరెడ్ల బేతాళుడు, ఉప్పల బంగారయ్య శెట్టి రమేష్, అన్నాజీ రావు, ఏనుగుల సత్యనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



నులి పురుగుల మాత్రలు మింగిస్తున్న ఎంపిపి లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

విద్యార్థులు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి బలమైన పోషకాహారం అందించాలని ఎంపిపి కారం లక్ష్మి కోరారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని విఆర్.పురం హైస్కూల్, రేఖపల్లి కెజిబివి, మినీ గురుకులం, అంగన్వాడీ సెంటర్లు, వివిధ పాఠశాలల్లో మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి చేతుల మీదుగా నులి పురుగులు మందులు విద్యార్థుల చేత మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధులు బారిన పడకుండా ఉంటే చదువుల పట్ల శ్రద్ధ చూపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రేఖపల్లి, శ్రీరామగిరి, రామవరం, పెదమట్టపల్లి, విఆర్.పురం సర్పంచ్‌లు పూనం సరోజిని, పులి సంతోష్ కుమార్, కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, సోడి నరసమ్మ, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సోడి మల్లయ్య, కారం సుందరయ్య, వీర్ల నాగేశ్వరావు, సిహెచ్.సుబ్బారావు, ప్రకాష్ రావు, కృష్ణవేణి, విఆర్ పురం హైస్కూల్ హెచ్ఎం బాబురావు, ఆయా పాఠశాలల సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్ అలివేలు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డి వార్నింగ్ ప్రోగ్రామ్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం సీలేరు పిహెచ్సి సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎంపిహెచ్ఈఓకే జ్యోతి బాబు, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జోజుబాబు, బాలమణి, రాజబాబు, సత్యనారాయణ, కుమారి, దేవి, అరుణకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం శ్రీకృష్ణాపురం ప్రభుత్వ బాలికల ఆశ్రమ హైస్కూల్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్‌భాషా పాల్గొని, విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఇఒ సాధన, ఆర్‌బిఎస్‌కె మేనేజర్ వై. కిషోర్ కుమార్, విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, హెచ్‌వి వివియల్ పాత్రో, యం. ఎల్. హెచ్.పి దుర్గ, వైద్య సిబ్బంది ఎలీషా, విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి : చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు విధిగా వేసుకోవాలని సిడిపిఓ జి వెంకటరమణి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్ల అంగన్వాడి కేంద్రం, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి, ఏఎన్ఎం కోపూరు విజయలక్ష్మిల ఆధ్వర్యంలో మాత్రలు మింగించారు.కార్యక్రమంలో ఆశా కార్యకర్త తూబెరి నూకరత్నం, అంగన్వాడి కార్యకర్త పుట్టపల్లి నాగరత్నం, అంగన్వాడి ఆయా రామతల్లి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ :. దుంబ్రిగుడ అంగన్వాడీ కేంద్రంలో సీడీపీవో నీలిమ చిన్నారులకు మాత్రాలను వేశారు బాలికల ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో దుంబ్రిగుడ పీహెచ్‌సి ఎంపీఈహెచ్ఓ శౌరి విద్యార్థులకు మాత్రలను మింగించారు. హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఎం ఎల్ హెచ్ పి శిరీష, ఏఎన్ఎంలు కిరణ్మయి, ప్రసన్నకుమారి, ఆశా కార్యకర్తలు మేరి,నిర్మల పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపుపై చిరు వ్యాపారుల ఆందోళన

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించకుండా 516 ఈ-హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండల కేంద్రంలో దుకాణాలు తొలగిస్తుండడంపై వారు ఆందోళన చెందుతున్నారు.కొంతమందికి పరిహారం చెల్లించి, చాలామందికి ఇంకా చెల్లించలేదని, అయినా అందరి దుకాణాలను తొలగించడం ఏంటని బాధిత చిరు వ్యాపారులు హైవే అధికారులను ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దుంబ్రిగుడలో గుంటసీమ రోడ్డును ఆనుకుని రోడ్డుకు ఇరువైపులాఉన్న దుకాణాలను తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. దశాబ్దాలుగా స్థానిక గిరిజనులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలతో జీవనోపాధి పొందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించి దుకాణాలను తొలగించాలని బాధిత గిరిజన చిరు వ్యాపారులు కోరుతున్నారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్‌జి పాలిమర్స్ బాధిత, ప్రభావిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు కంపెనీ ప్రతినిధులతో కలిసి సహాయక చర్యలు చేపడతామని వెల్లడించారు. పాలిమర్స్ కంపెనీ చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామాల ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు.



పేరుకుపోయిన చెత్తాచెదారం

టీచర్స్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి -సీలేరు : టీచర్స్ కాలనీలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్వాసన కొడుతుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పడిన వర్షాలకి చెత్తకుండీలో ఉన్న చెత్త కుళ్ళిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, తద్వారా మలేరియా టైఫాయిడ్ డెంగీ సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచి దుర్గో స్పందించి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న టీచర్స్ కాలనీలో చెత్తను తొలగించి పరిశుభ్రపరచాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.



పర్సును బాధితునికి అందజేస్తున్న కండక్టర్

కండక్టర్ నిజాయితీ

- బస్‌లో దొరికిన పర్సు బాధితునికి అందజేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గోకవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్ నిజాయితీగా వ్యవహరించారు. గోకవరం డిపో బస్సు గోకవరం నుండి పాతకోట వెళుతుండగా రంపచోడవరం మండలం దెబ్బవలస గ్రామానికి చెందిన నెల్లూరి ఆంజనేయ రెడ్డి ఆ బస్సులో నిద్రపోవడం వల్ల అతని పర్సు బస్సులు పడిపోయింది. బస్ కండక్టర్ సిహెచ్‌వి రమణ గమనించి ఆ మార్గంలోని మారేడుమిల్లి పోలీస్ స్టేషన్‌లో గుర్తేరు ఎస్సై సాయికుమార్‌కి పర్సు అందించారు. గుర్తేడు ఎస్సై సాయికుమార్ బాతునికి ఫోన్ చేసి పర్సు అందులో ఉన్న నగదు కండక్టర్ ద్వారా బాధితునికి అందజేయడం జరిగింది. కండక్టర్ చేసిన పనిని గుర్తేడు ఎస్సై సాయి కుమార్ అభినందించడం జరిగింది.

అన్ని కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామంలోని అన్ని కుటుంబాలకు నూతనంగా ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని ఆ గ్రామస్తులు మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నిమ్మచెట్టు గ్రామంలో నాలుగు కుటుంబాలకే కొత్త ఇల్లు మంజూరు చేస్తామని అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. వర్షాలకు గ్రామంలోని అన్ని కుటుంబాలు ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నాయని పూర్తిస్థాయిలో సర్వే చేయకుండా తూతు మంత్రంగా అధికారులు సర్వే చేసి కేవలం నాలుగు కుటుంబాలకు ఇల్లు మంజూరు చేస్తామని చెప్పడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో మోకాల్లోతు బురద వెళ్లిపోయి పూర్తిగా నష్టపోవడమే కాకుండా కట్టు బట్టలతో మిగిలామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లల్లో బురద పూర్తి స్థాయిలో చేరడంతో నివాసం ఉండడానికి అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కలెక్టర్, పిఒ స్పందించి గ్రామంలో అందరికీ పూర్తిస్థాయిలో ఇల్లు నిర్మించాలని కోరారు.

జారిపడటంతో తీవ్ర గాయాలు

రహదారి సౌకర్యం లేక డోలీమోతతో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం ఏ.దారకొండ పంచాయతీకి చెందిన చిలక పెద్దమ్మి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుండి పశువుల కాపుకు వెళ్తుండగా మార్గమధ్యలో జారిపడి కుడికాలు తొడ మధ్యభాగంలో విరిగిపోయింది. సరైన రహదారి సౌకర్యం లేక ఆమెను ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ రావడానికి వీల్లేకపోవడంతో స్థానికులు డోలికట్టి కాలినడకన మోసుకుంటూ ఆర్‌వి నగర్ ఆసుపత్రికి వైద్య సేవ నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు, వరదలకు గొల్లపల్లి, పెబ్బేంపల్లి, తడకపల్లి బీటీ రోడ్లు వంతెనలు కొట్టుకుపోయాయని తెలిపారు. ఇప్పటివరకు ఈ రహదారులు, వంతెనలు పునరుద్ధరించే విధంగా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని, గ్రామానికి వాహనాలు రాకపోకలు సాగించే వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఓ అభిషేక్ స్పందించి కోతకు గురైన రహదారి, బ్రిడ్జిలకు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి రాకపోకలు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

రూ.20.06 కోట్ల జివిఎంసి అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం సుమారు రూ.20.06 కోట్లు కేటాయింపునకు ఆమోదం తెలిపినట్లు స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో ఈ నెల 13న జరిగిన స్థాయీ సంఘం సమావేశం కొనసాగింపులో భాగంగా మంగళవారం స్థాయీ సంఘ సభ్యులు మరలా సమావేశమయ్యారు.